మెయిన్
# టీ-మీడియా
సామాజికం.. ప్రజల పక్షం...
సంపుటి : 8
సంచిక : 120
పేజీలు : 3
గురువారం 20.11.2025
GSTIN:36FDKPS1308P1ZX | Digital, tmedia.net.in
ఎడిటర్ : శనగపాటి మురళీకృష్ణ




# చీర, సారె మన సాంప్రదాయం

## ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రారంభం

- అందించిన సీఎం రేవంత్ రెడ్డి

**టీ.మీడియా,నవంబర్19,హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలో స్వయం సహాయ సంఘాల మహిళలకు ఇందిరమ్మ చీరల పంపిణీ మొదలైంది. హైదరాబాద్?లో సీఎం రేవంత్? రెడ్డి ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి పలువురు మహిళలకు చీరలను పంపిణీ చేశారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా అంతకు ముందు నెక్లెస్ రోడ్‌లో ఆమె విగ్రహానికి సీఎం నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దామోదర రాజనర్సింహ, వాకిటి శ్రీహరి పాల్గొన్నారు.

**కోటి మంది మహిళలకు చీరలు**

తెలంగాణ వ్యాప్తంగా కోటి మంది మహిళలకు ఇందిరమ్మ చీరలను పంపిణీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. నేటి నుంచి తెలంగాణ తల్లి అవతరణ దినోత్సవం (డిసెంబరు 9) నాటికి గ్రామీణ ప్రాంతాల్లో చీరల పంపిణీ ప్రక్రియను పూర్తి చేయనున్నారు. రెండో దశలో మార్చి 1 నుంచి అంతర్జాతీయ మహిళా దినోత్సవం (మార్చి 8) వరకు పట్టణ ప్రాంతాల్లోని మహిళలకు అందజేస్తారు. ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా చీరల పంపిణీ జరుగుతోందని మండల కేంద్రాల్లో ఘనంగా జరగాలని సీఎం రేవంత్? రెడ్డి తెలిపారు. చీరల పంపిణీ కోసం నియోజకవర్గానికి ప్రత్యేక అధికారిని నియమించాలని, మండల కేంద్రాల్లో పండుగ వాతావరణంలో చీరల పంపిణీ జరగాలని అన్నారు. ఇందిరా మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించాలని, ఆర్థికంగా మహిళలను నిలబెట్టాలని ప్రభుత్వం ఆలోచిస్తోన్నట్లు చెప్పారు.

**గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మందికి**

మహిళలకు చీరలు పంపిణీ చేసి వారి వివరాలు సేకరించాలన్న సీఎం రేవంత్?, దీని ద్వారా భవిష్యత్తులో సంక్షేమ పథకాలు వర్తిస్తాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 65 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. మున్సిపాలిటీల్లో 35 లక్షల మంది మహిళలకు చీరల పంపిణీ చేస్తామని, మొత్తం కోటి మంది మహిళలకు చీరల పంపిణీ తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళా సంఘాల సమన్వయంతో చీరల పంపిణీ జరగాలని ఆదేశించారు.ఆడబిడ్డలకు చీర, సారె పెట్టడం తెలంగాణ సంప్రదాయమని సీఎం రేవంత్? రెడ్డి అన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం కల్పించామన్న సీఎం, అద్దె బస్సులకు వారిని యజమానులను చేశామని అన్నారు. స్కూల్స్ యూనిఫారం కుట్టే బాధ్యతను మహిళా సంఘాలకే అప్పగించామని అన్నారు. రాష్ట్రంలో మహిళా సంఘాలు ఉత్పత్తి చేస్తున్న వస్తువులను ఆన్‌లైన్ మార్కెటింగ్ కోసం అమెజాన్‌తో సంప్రదింపులు చేస్తున్నట్లు రేవంత్‌రెడ్డి వెల్లడించారు. 'మహిళల ఉన్నతి- తెలంగాణ ప్రగతి' పేరుతో పండగ వాతావరణంలో ఇందిరా మహిళా శక్తి చీరలు పంపిణీ చేయాలని అధికారులకు సీఎం తెలిపారు. అర్హులైన మహిళందరికీ చీరలు ఇస్తామని ఎవరూ ఆందోళన చెందవద్దని ముఖ్యమంత్రి తెలిపారు.

**ధాన్యం కొనుగోళ్ల బాధ్యత మహిళా సంఘాలకే**




### కోటీశ్వరులను చేయడమే మా లక్ష్యం

ఇందిరాగాంధీ చేసిన అభివృద్ధి బాటలో కాంగ్రెస్ ప్రభుత్వం నడుస్తుందని, కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. దేశ ప్రగతి, పేదల అభ్యున్నతి కోసం ప్రాణాలర్పించిన మహనీయురాలు ఇందిరాగాంధీ అని ఆయన కొనియాడారు. మాజీ ప్రధాని ఇందిరాగాంధీ జయంతిని పురస్కరించుకొని ఆమెను సీఎం స్మరించుకున్నారు. ఆమె ప్రాణాలకు ముప్పు ఉందని తెలిసినా దేశ సమగ్రత, సమైక్యత కోసం కఠిన నిర్ణయాలు తీసుకున్నారని వెల్లడించారు. ఇందిరమ్మ పాలనే ఆదర్శంగా రాష్ట్ర సర్కార్ పేదల అభ్యున్నతి కోసం అనేక సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఆయన స్పష్టం చేశారు.

సచివాలయం నుంచి జిల్లాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు, కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్రంలోని మహిళలందరినీ తోబుట్టువుగా భావించి ప్రభుత్వం చీరల పంపిణీ చేపట్టిందని తెలిపారు. బస్సులకు మహిళలను యజమానులను చేశామని సీఎం తెలిపారు. యునిఫాంలు కుట్టే బాధ్యతను అప్పజెప్పడం వల్ల మహిళా సంఘాలకు రూ. 30 కోట్ల ఆదాయం వచ్చిందని అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా పాఠశాలల్లో రూ. 534 కోట్ల పనులు జరిగాయని తెలిపారు. ధాన్యం కొనుగోళ్ల బాధ్యతను కూడా మహిళా సంఘాలకే అప్పగించినట్లు సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు.


**నెలకు రూ.2 లక్షల లాభం**

శిల్పారామం పక్కన వందల కోట్ల విలువైన 3 ఎకరాల్లో ఇందిరా మహిళా శక్తి బజార్ ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. మహిళా సంఘాల ఉత్పత్తులకు అంతర్జాతీయ మార్కెట్ కల్పించే లక్ష్యంతో అమెజాన్‌తో సంప్రదింపులు



జరుపుతున్నట్లు సీఎం వెల్లడించారు. వివిధ జిల్లాల నుంచి కలెక్టర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. పెట్రోలు బంకు ఎలా నడుస్తోందని నారాయణపేట జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు అరుంధతిని సీఎం అడగ్గా నెలకు రెండు లక్షల లాభం వస్తోందని ఆమె తెలిపారు. ఇతర జిల్లాల మహిళ సంఘాలను అక్కడికి తీసుకెళ్లి చూపించాలని కలెక్టర్లకు సీఎం సూచించారు. చీరల డిజైన్లు, సైజులు బాగున్నాయని రాజన్న సిరిసిల్ల మహిళ సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య సీఎంకు చెప్పారు. తమకూ ఒక యునిఫాం వచ్చిందని ఈ చీరల ద్వారా స్వయం సహాయక సంఘాల సభ్యులకు ప్రత్యేక గుర్తింపు కనిపిస్తుందని కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు శ్రీదేవి సంతోషం వ్యక్తం చేశారు.

---



## గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను భారత్‌కు తీసుకొచ్చిన ఎన్ఐఏ

**టి మీడియా, నవంబర్ 19 , ఢిల్లీ :** ఎన్సీపీ నేత బాబా సిద్ధిఖ్ హత్య కేసులో కీలక నిందితుడైన అన్మోల్ బిష్ణోయ్‌ను అమెరికా డిపోర్ట్ చేయగా, అతనిని ఎన్?ఐఏ అధికారులు భారత్‌కు తీసుకొచ్చారు. అతనితోపాటు మరో 199 మందిని కూడా అమెరికా డిపోర్ట్ చేసింది. వారిలో ఇద్దరు పంజాబ్ మోస్ట్ వాంటెడ్ జాబితా ఉండగా, మరో 197 మంది అమెరికాలో అక్రమంగా నివసిస్తున్నవారు కావడం గమనార్హం. బుధవారం మధ్యాహ్నం ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో, వీరిని తీసుకొచ్చిన ఫ్లైట్ ల్యాండ్ అయ్యిందని అధికారులు తెలిపారు.అమెరికా నుంచి తీసుకొచ్చిన గ్యాంగ్‌స్టర్ అన్మోల్ బిష్ణోయ్‌ను ఢిల్లీలోని పటియాలా హౌస్ కోర్టులో హాజరుపరుస్తారని సమాచారం. వాస్తవానికి గ్యాంగ్‌స్టర్ లారెన్స్ బిష్ణోయ్ తమ్ముడే ఈ అన్మోల్ బిష్ణోయ్. గతేడాది ఏప్రిల్ నెలలో బాలీవుడ్ నటుడు సల్మాన్ ఖాన్ ఇంటి వద్ద కాల్పులకు బాధ్యత వహిస్తూ స్వయంగా ఇతనే సామాజిక మాధ్యమాల్లో పోస్టులు పెట్టడం గమనార్హం. దీనితో ముంబయి పోలీసులు ఇతనిపై లుకౌట్ నోటీసులు జారీ చేశారు.అన్మోల్ బిష్ణోయ్ చాలా కేసుల్లో కీలక నిందితుడిగా ఉన్నాడు. 2022లో ప్రముఖ పంజాబీ గాయకుడు సిద్ధూ మూసేవాలా హత్య కేసులో కూడా ఇతను అభియోగాలు ఎదుర్కొంటున్నాడు. అయితే మూసేవాలా హత్యకు కొన్ని రోజుల ముందు అన్మోల్ నకిలీ పత్రాలు ఉపయోగించి దేశం దాటి వెళ్లాడని నిఘా వర్గాలు గుర్తించాయి. అతనిపై వివిధ ప్రాంతాల్లో దాదాపు 20 వరకు కేసులు నమోదు అయ్యాయి. అతని గురించి సమాచారం ఇచ్చిన వారికి జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్?ఐఏ) రూ.10 లక్షల రివార్డు కూడా ప్రకటించడం గమనార్హం.అన్మోల్ బిష్ణోయ్? విదేశాల్లోనూ క్రిమినల్ కార్యకలాపాలు నిర్వహించేవాడు. అక్కడ నుంచే ఆజ్ఞలు ఇస్తూ, తన అనుచరులతో భారత్‌లో పలు క్రైమ్స్ చేయించినట్లు పోలీసులు గుర్తించారు. అందుకే అతడిని భారత్‌కు రప్పించేందుకు ముంబయి పోలీసులు ముమ్మర ప్రయత్నాలు చేశారు. ఈ నేపథ్యంలోనే గతేడాది అన్మోల్ అమెరికా పోలీసులకు చిక్కాడు. దీనితో అతనిని అప్పగించాలని ఎన్ఐఏ అధికారులు అమెరికాలోని ఎఫ్‌బీఐ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ హోంల్యాండ్ సెక్యూరిటీలతో సంప్రదింపులు జరిపారు. దీనితో అమెరికా అన్మోల్ బిష్ణోయ్‌ను డిపోర్ట్ చేసింది.

### ఉగ్రవాద సంస్థల జాబితాలోకి బిష్ణోయ్ గ్యాంగ్

అంతకుముందు ఇటీవలె భయం, భయానక వాతావరణం సృష్టిస్తోందంటూ లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌ను ఉగ్రవాద సంస్థల జాబితాలో చేర్చింది కెనడా ప్రభుత్వం. తమ దేశంలో హింస, ఉగ్రవాద చర్యలకు స్థానం లేదని కెనడా ప్రభుత్వం విడుదల చేసిన ఓ ప్రకటనలో వెల్లడించింది. ముఖ్యంగా నిర్దిష్ట వర్గాలను లక్ష్యంగా చేసుకొని భయం, బెదిరింపు వాతావరణాన్ని సృష్టించే కార్యకలాపాలకు తమ దేశంలో చోటులేదని పేర్కొంది. భారత జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) అజీత్ డోభాల్ ఇటీవల కెనడా ఎన్ఎస్ఏ నథాలీ డ్రొయిన్‌తో విస్తృత సంప్రదింపులు చేపట్టారు. ఈ క్రమంలో బిష్ణోయ్ గ్యాంగ్‌పై కెనడా ఉగ్రముద్ర వేశారు. అయితే ఈ నిర్ణయంతో కెనడాలోని బిష్ణోయ్ గ్యాంగ్‌కు చెందిన ఆస్తులు, వాహనాలు, స్థలాలను ప్రభుత్వం స్వాధీనం చేసుకునే అవకాశం ఉంది. ఉగ్రవాద కార్యక్రమాలకు నిధుల సేకరణ, వివిధ నేరాలకు సంబంధించిన కేసుల్లో బిష్ణోయ్ ముఠా సభ్యులను విచారణతో పాటు ముఠా సభ్యులపై ఆ దేశ పోలీసులు నిఘా ఉంచనున్నారు

---

## తెలంగాణలో పంచాయతీ ఎన్నికలు

- ఓటరు జాబితా సవరణకు షెడ్యూల్
- కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు




**టీ.మీడియా,నవంబర్19,హైదరాబాద్ బ్యూరో:** తెలంగాణ రాష్ట్రంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం కసరత్తు మొదలుపెట్టింది. ఇందులో భాగంగానే పంచాయతీల్లో ఓటరు జాబితా మరోసారి సవరణకు ఎస్ఈసీ షెడ్యూలు విడుదల చేసింది. రేపటి నుంచి నవంబర్? 23 వరకు గ్రామాల్లో ఓటర్ల జాబితాలను సవరించాలని తెలిపింది. ఈ నెల 20న ఓటర్ల దరఖాస్తులు, తప్పుల సవరణ, అభ్యంతరాల స్వీకరణ, ఈ నెల 21న ఓటర్ల దరఖాస్తులు, అభ్యంతరాల పరిష్కారం, 23న తుది ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల ప్రచురణ ఉంటుందని ఎన్నికల సంఘం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ మేరకు జిల్లా పంచాయతీ అధికారులకు తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆదేశాలు జారీ చేశారు.ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు : తెలంగాణ రాష్ట్రంలో వచ్చే నెల రెండో వారంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు షెడ్యూలు వెలువడే అవకాశం ఉంది. అదే నెలాఖరులోపు పంచాయతీ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేసే అవకాశం ఉంది. వచ్చే నెల 1 నుంచి 9 వరకు ప్రజాపాలన వారోత్సవాల తరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు మంత్రి మండలి నిర్ణయం నేపథ్యంలో ఈ ప్రక్రియపై తెలంగాణ రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ, రాష్ట్ర ఎన్నికల సంఘం దృష్టి సారించాయి. సోమవారం మంత్రిమండలి భేటీలో స్థానిక ఎన్నికలపై విస్తృతంగా చర్చ జరిగింది. రిజర్వేషన్ల అమలు, రాష్ట్ర హైకోర్టు, సుప్రీంకోర్టు ఆదేశాలు, న్యాయ నిపుణుల సలహాలపై పంచాయతీరాజ్‌శాఖ నివేదిక ఇచ్చింది. దానిపై మంత్రులు తమ అభిప్రాయాలను తెలిపారు. ఈ నెల 24న తెలంగాణ హైకోర్టులో విచారణ గురించి చెప్పారు. మార్చి 31లోపు పంచాయతీ ఎన్నికలను పూర్తి చేస్తేనే కేంద్ర ఆర్థిక సంఘం నుంచి నిధులు విడుదలయ్యే అవకాశం ఉందని అన్నా రు.

---


## శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలు

- నాణెం, స్టాంపులను ఆవిష్కరించిన ప్రధాని మోదీ

**టీ మీడియా,నవంబర్19,పుట్టపర్తి :** పుట్టపర్తిలో సత్యసాయి శతజయంతి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం ఈ ఉత్సవాలకు ప్రధాని మోదీ హాజరయ్యారు. ముందుగా పుట్టపర్తి విమానాశ్రయానికి చేరుకున్న ఆయనకు ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ స్వాగతం పలికారు. అనంతరం ప్రధాని నరేంద్ర మోదీ పుట్టపర్తిలోని ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సత్యసాయి శత జయంత్యుత్సవానికి ఆయన హాజరయ్యారు. సాయి కుల్వంత్ హాల్‌లో సత్యసాయి మహా సమాధిని ప్రధాని దర్శించుకున్నారు.ఆయన వెంట ఏపీ సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఉన్నారు. అనంతరం హిల్ వ్యూ స్టేడియానికి మోదీ చేరుకున్నారు. బాబా జీవితం, బోధనలు, సేవల స్మారకార్థంగా రూపొందించిన రూ.100 నాణెం, 4 తపాలా బిళ్లలను ప్రధాని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్, ప్రముఖ నటి ఐశ్వర్యారాయ్ తదితరులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వారంతా మాట్లాడుతూ సత్యసాయి కీర్తిని కొనియాడారు.

**పుట్టపర్తి భూమిలో ఏదో మహత్తు ఉంది**

సత్యసాయి జయంత్యుత్సవాల్లో పాల్గొనడం తమ అదృష్టమని ప్రధాని మోదీ అన్నారు. సత్యసాయి భౌతికంగా లేకున్నా. ఆయన ప్రేమ మనతోనే ఉందన్నారు. విశ్వప్రేమకు ప్రతిరూపంగా ఆయన జీవించారని, భారతీయ నాగరికతకు సేవ మూల కేంద్రంన్నారు. భక్తి, జ్ఞానం, కర్మ ఈ మూడూ సేవతోనే ముడిపడి ఉంటాయన్నారు. సేవే పరమ ధర్మమని మన నాగరికత చెప్పిందని వివరించారు. బాబా బోధనలు లక్షల మందికి మార్గం చూపాయని, అందరినీ ప్రేమించు, అందరినీ సేవించు ఇదే బాబా నినాదమని, ఆయన బోధనల ప్రభావం దేశమంతా కనిపిస్తుందన్నారు. కోట్లమంది బాబా భక్తులు మానవసేవ చేస్తున్నారని, బాబా ప్రేమ సూత్రాలు ఎందరినో ఆలోచింపజేశాయన్నారు. చాలామంది జీవితాలను బాబా సమూలంగా మార్చేశారని, లక్షలమందిని బాబా సేవామార్గంలో నడిపించారని ప్రధాని మోదీ అన్నారు.



సత్యసాయి ప్రజల కోసం ఎన్నో కార్యక్రమాలు చేపట్టారని మోదీ తెలిపారు. తాగునీరు, వైద్యం, విద్య వంటి రంగాల్లో విశిష్ట సేవలు అందించారన్నారు. 20 వేలమంది బాలికలకు ఇవాళ సురక్ష సమృద్ధి

మిగతా 3లో..

---

## మళ్లీ భారీ ఎన్కౌంటర్

- ఏడుగురు మావోయిస్టుల మృతి

**టీ.మీడియా,నవంబర్19,చింతూరు:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి మండలం నెల్లూరు అటవీ ప్రాంతంలో మంగళవారం ఉదయం ఎదురు కాల్పులు జరిగి ఆరుగురు మావోయిస్టుల మృతి చెందిన విషయం పాఠకులకు విధితమే. మారేడుమిల్లి మండలంలో బుధవారం గుజ్జు మామిడి వలస గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్కౌంటర్లో ఏడుగురు మావోయిస్టు మృతి చెందారు. ఈ ఎన్కౌంటర్ కు ఆపరేషన్ సంభవ్ అని పేరు పెట్టారు. గుజ్జు మామిడి వలస అటవీ ప్రాంతంలో బుధవారం ఉదయం 05:00 గంటల నుండి 05:45 గంటల మధ్య, పోలీస్ స్టేషన్ నుండి దాదాపు 7.5 కి.మీ దూరంలో ఉన్న ఒక కొండ సమీపంలో మరో కాల్పుల సంఘటన జరిగింది. ఈ ఆపరేషన్‌లో, సి ఆర్ పి ఎఫ్ తో సహా భద్రతా దళాలు కీలకమైన మద్దతును అందించాయి. పోలీసు దళాల విజయానికి గణనీయంగాదోహదపడ్డాయి. బుధవారం జరిగిన ఎన్కౌంటర్లో జరిగిన ఎన్కౌంటర్లో మొత్తం 7 మృతదేహాలను వెలికితీశారు, వాటిలో 4 పురుషులు మరియు 3 మహిళలు ఉన్నారు. మృతుల్లో మోటూరు జోగారావు, జ్యోతి, మరో ఐదుగురిని గుర్తించారు. మంగళ, బుధవారాల్లో జరిగిన ఎన్కౌంటర్లో మొత్తం 13 మావోయిస్టులు హతమయ్యారు.సంఘటనా స్థలంలో 2 ఏకే 47, మ్యాగ్జిన్లు 5, రౌండ్లు 72,యస్ బి, బి యల్ 5 గన్స్, 34 రౌండ్స్,303 రైఫిలు ఒకటి, 24 రౌండ్లు, మూడు కేజీల వైరు, డెటోనేటర్లు 18 కిట్‌బ్యాగులు స్వాధీనం చేసుకున్నారు.














## మా ఎమ్మెల్యేనే కదా కండువా కప్పితే తప్పేంటి



**టి మీడియా, నవంబర్ 19 , జగిత్యాల :** పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను బీఆర్ఎస్ కార్యకర్త నిలదీశాడు. బీఆర్ఎస్ పార్టీలోనే ఉంటే గులాబీ కండువా కప్పుకోవాలని డిమాండ్ చేస్తూ సంజయ్ కార్యక్రమానికి వెళ్లాడు. కానీ ఇది గమనించిన పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తను అరెస్టు చేసి తీసుకెళ్లారు. జగిత్యాల జిల్లా బీర్పూర్ మండలం తాళ్లధర్మారంలో ఓ కార్యక్రమానికి సంజయ్ వస్తున్నాడని తెలిసి బీఆర్ఎస్ కార్యకర్త నారపాక రవీందర్ అక్కడికి వెళ్లాడు. సంజయ్ రావడానికి ముందే వెళ్లిన అతను.. ఎమ్మెల్యే రాగానే గులాబీ కండువా కప్పాలని రెడీగా ఉన్నాడు. అయితే ఇది గమనించిన పోలీసులు రవీందర్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లిపోయారు. ఇదేంటని అడిగితే బీఆర్ఎస్ కండువా పట్టుకుని ఉండొద్దని పోలీసులు రవీందర్ను అరెస్టు చేసి బీర్పూర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను నారపాక రవీందర్ పలు ప్రశ్నలు సంధించాడు. ఇప్పటికే బీఆర్ఎస్‌లోనే ఉన్నానని సంజయ్ చెబుతున్నాడు కదా.. మరి పార్టీ కండువా కప్పితే అభ్యంతరమేంటని ప్రశ్నించాడు. కానీ పోలీసులు దీనికి సమాధానం చెప్పకుండా రవీందర్‌ను అక్రమంగా అరెస్టు చేసి బీర్పూర్ పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు.

## కాంగ్రెస్ పార్టీకి షాక్

### బీఆర్ఎస్‌లో చేరిన నాయకులు



**టి మీడియా, నవంబర్ 19 , హైదరాబాద్ :** హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ పార్టీకి షాక్ తగిలింది. శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ జాయింట్ సెక్రటరీ విమల్ కుమార్‌తో పాటు పలువురు నేతలు కారెక్కారు. తెలంగాణ భవన్‌లో జరిగిన ఈ కార్యక్రమానికి పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరయ్యారు. విమల్ కుమార్‌తో పాటు పలువురు నాయకులకు కేటీఆర్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీ తమను మోసం చేసిందని విమల్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తామన్నారు.

## కళ్యాణ లక్ష్మి, సీఎంఆర్ఎఫ్ చెక్కులు

**-పంపిణీ చేసిన శాసనసభ్యులు**



**టీ మీడియా ,నవంబర్ 19 ,పెబ్బేరు:** బుధవారం పెబ్బేరు మండల గ్రామాలకు చెందిన సీఎంఆర్ఎఫ్ 6 96 500 విలువ గల చెక్కులను పేదలకు హాస్పటల్ ఖర్చుల నిమిత్తం ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి వివిధ గ్రామాలకు కళ్యాణ లక్ష్మి 485568 రూ సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేయడం జరిగింది పెబ్బేరు అయ్యవారిపల్లి శాఖాపురం రంగాపురం బునాదిపురం గుమ్మడం సుగురు పెంచికలపాడు జను%శీ% పల్లితోమాలపల్లి వివిధ గ్రామాలకు వనపర్తి శాసనసభ్యులు వనపర్తి క్యాంపు కార్యాలయంలో చెక్కులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కిశ్రీనివాసులు గౌడ్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విజయవర్ధన్ వర్కింగ్ ప్రెసిడెంట్ వెంకటసాగర్ మాజీ సర్పంచ్ సురేందర్ గౌడ్ యుగంధర్ రెడ్డి రంజిత్ కుమార్ మార్కెట్ డైరెక్టర్ రామన్ గౌడ్ బుర్ర మోని రాములుయాదవ్ అయ్యవారిపల్లి లక్ష్మణ్ రాజేష్ కుమార్ శివకుమార్ డైరెక్టర్ రాములు.

## ఇందిరాగాంధీ గారి 108వ జయంతి



**టీ మీడియా, నవంబర్ 19, పెబ్బేరు** :బుధవారం పెబ్బేరు మండల పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్వర్గీయ మాజీ మహిళా ప్రధాని ఇందిరా గాంధీ 108వ జయంతి సందర్భంగా వారి చిత్రపటానికి సుభాష్ చౌరస్తాలో పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు అనంతరం నాయకులు వారు దేశానికి చేసినటువంటి సేవలను కొనియాడుతు గరీబియా అటావో నినాదంతో బడుగు బలహీన వర్గాలకు ఎన్నో సంస్కారంలోకి తీసుకొచ్చారని బ్యాంకులజాతీయకరణ పేదలకు భూ పంపిణీ కార్యక్రమం చేపట్టి ఉక్కు మహిళగా ఆమెకు ఎంతో కీర్తి ఉందని అన్నారు ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో పెబ్బేరు మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు పార్టీ శ్రేణులు అభిమానులుఅధిక సంఖ్యలో పాల్గొన్నారు

## ఇందిరా గాంధీ జయంతి వేడుకలు



**టీ మీడియా, నవంబర్ 19 ,పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద బుధవారం రోజున మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా, ఎమ్మెల్యేవిజయ రమణారావు, పాల్గొని వారిచిత్రపటానికి పూల మాలలేసి నివాళు లర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి వేడుకలను నిర్వహించారు.

ఎమ్మెల్యే మాట్లాడుతూ, భారతదేశానికి మొట్టమొదటి ప్రధానమంత్రిగా ఎన్నికై దేశానికి ఎనలేనని సేవలు చేసి, దేశవ్యాప్తంగా ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు, పక్కా ఇల్లు నిర్మించి, భూమి లేని నిరుపేదలకు భూములు పంచి నిరుపేదల గుండెల్లో చిరస్థాయిగా ఉక్కు మహిళా ఇందిరమ్మ పేద ప్రజలకు అండగా నిలిచిందని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు, మాజీ కౌన్సిలర్లు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## డబుల్ బెడ్ రూమ్ పంపిణీలో గందరగోళం

**ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడి**



**టి మీడియా, నవంబర్ 19 , భూపాలపల్లి :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల పంపిణీలో గందరగోళం నెలకొంది. అనర్హులకు అధికార పార్టీ నాయకుల అనుచరులకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను కేటాయించారని పేద ప్రజలు ఆందోళనకు దిగారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ముట్టడించి ధర్నా చేశారు. వారిని పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు ఎలా ఉన్నాయి. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్మించిన 416 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు ఈరోజు అధికారులు లాటరీ ద్వారా ఇండ్లను కేటాయించారు. ఎమ్మెల్యే తన కార్యకర్తలకు, అర్హత లేని వారికి ఇండ్లను కేటాయించారని అర్హులైన లబ్ధిదారులు మండిపడ్డారు.

## ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కన్వీనర్

**-అల్వాల రాజేందర్ నియామకం.**




**టీ మీడియా, నవంబర్ 19, పెద్దపల్లి:** పెద్దపల్లి పట్టణంలోని మాన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిననూతన కమిటీల సమావేశంలో పెద్దపల్లి జిల్లా, పెద్దపల్లి మండలం రాఘవపూర్ గ్రామానికి చెందిన అలువాల రాజేందర్ ను బీసీ జేఏసీ హ్యూమన్ రైట్స్, ఇంటలెక్చువల్ ఫోరం జిల్లా కన్వీనర్ గా నియమించిన బీసీ జేఏసీ పెద్దపల్లి జిల్లా చైర్మన్ దాసరి ఉష .ఈ సందర్భంగా మాట్లాడుతూ బీసీ సంఘంలో హ్యూమన్ రైట్స్ లో చురుకుగా పాల్గొంటూ పలు సమస్యలపై తనదైన శైలిలో ముద్ర వేసుకున్నటువంటి అలవాల రాజేందర్ కు పదవి బాధ్యతలు అప్ప చెప్పడం జరిగిందని , ఉద్యమం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పలువురు బీసీ నాయకులు, పాల్గొన్నారు

# 'పారిపోతున్నా వదలలేదు

## పిల్లలను గోదావరిలోకి తోసి తండ్రి ఆత్మహత్య



**టి మీడియా, నవంబర్ 19 , కోనసీమ :** నాన్న పక్కన ఉంటే ఏ పిల్లలకైనా ఎంతో ధైర్యంగా ఉంటుంది. బిడ్డలకు చిన్న గాయమైనా తండ్రి తల్లడిల్లిపోతాడు. వారికి ఏ కష్టం రాకుండా కంటి రెప్పలా కాపాడుకుంటాడు. నాన్న వేలు పట్టుకుంటే భయం లేకుండా ఏదైనా చెయ్యగలమనే నమ్మకం ఉంటుంది. అలాంటి తండ్రితో బయటకు వెళ్లడం పిల్లలకు ఎంతో సరదా. తండ్రి వెనక బండిపై కూర్చుని హాయిగా ప్రయాణిస్తారు. కానీ కోనసీమకు చెందిన ఓ తండ్రి తన ఇద్దరు పిల్లలను బయటకు తీసుకెళ్లి వారికి మరణ శాసనం రాశాడు. ఇద్దరు పిల్లల్ని గోదావరిలోకి నెట్టి ఆపై తానూ దూకాడు. ఈ ఘటనతో వారి కుటుంబంలో విషాద చాయలు అలుముకున్నాయి.

**అసలేటం జరిగిందంటే**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం 'రండమ్మా ఆధార్ అప్‌డేట్ చేసుకుని వద్దాం' అంటూ నాన్న పిలవగానే ఆ పిల్లలిద్దరూ ఉత్సాహంగా బయలుదేరారు. 'అమ్మా వెంటనే వచ్చేస్తామమ్మా' అంటూ వీడ్కోలు చెప్పారు. ఇక ఎప్పటికీ వెనక్కిరామని ఆ చిట్టి హృదయాలకు తెలియదు. తీసుకువెళ్లిన తండ్రి గోదావరిలోకి తోసి, తానూ ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిసి ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కోనసీమ జిల్లా మలికిపురం మండలం లక్కవరంలో ఫైనాన్స్ వ్యాపారి శిరిగినీడి దుర్గాప్రసాద్ (37) భార్య నాగవేణి, కుమారుడు మోహిత్ (13), కుమార్తె జాహ్నవి (9)తో కలిసి నివసిస్తున్నారు. వారం రోజులుగా విశ్వేశ్వరాయపురంలోని నాగవేణి కన్నవారి ఇంటి వద్ద ఉన్నారు. ఆధార్ అప్‌డేట్ చేయాలంటూ సోమవారం పిల్లలిద్దరినీ తీసుకొని దుర్గాప్రసాద్ బైకుపై బయలుదేరాడు. రాత్రి పశ్చిమగోదావరి జిల్లా యలమంచిలి స్టేషన్ పరిధి చించినాడ వశిష్ఠ వారధిపై ఈ వాహనం, పాదరక్షలు, చరవాణి నంబర్లతో కూడిన కాగితం కనిపించాయి. మంగళవారం గోదావరిలో గాలించగా దుర్గాప్రసాద్, మోహిత్ మృతదేహాలు కనిపించాయి. జాహ్నవి ఆచూకీ కానరాలేదు. బుధవారం మళ్లీ అన్వేషిస్తామని మలికిపురం ఎస్సై పి. సురేశ్ తెలిపారు.

**ముందు కుమార్తెను నదిలోకి**

ఇద్దరు పిల్లలతో వంతెన మీదకు వచ్చిన దుర్గాప్రసాద్ తొలుత కుమార్తెను నదిలోకి తోసినట్లు భావిస్తున్నారు. ఇది చూసిన కుమారుడు హడలిపోయి పరుగు తీయగా అతడిని తండ్రి వెంబడించినట్లు అటుగా వెళ్లిన ఆటో డ్రైవర్ చెప్పారని ప్రసాద్ స్నేహితులు చెబుతున్నారు. సరదాగా పరుగెడుతున్నారను కున్నామని ఇంతటి దారుణానికి ఒడిగడతాడని ఊహించలేదని డ్రైవర్ తెలిపారన్నారు.

**ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందో**


ఇద్దరు పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకోవాల్సినంత కష్టం ఏమొచ్చిందోనని బంధువులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబ కలహాలా, ఆర్థిక సమస్యలా, ఇంకేమైనా కారణాలా అనేది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**ప్రేమ వివాహం**

దుర్గాప్రసాద్, నాగవేణిలది ప్రేమ వివాహం. ప్రసాద్ ఉపాధి రీత్యా కువైట్ వెళ్లి వచ్చాడు. పిల్లలిద్దరినీ విశ్వేశ్వరాయపురంలో చదివిస్తున్నాడు. నాగవేణి తండ్రి రేకపల్లి వెంకటేశ్వరరావు గల్ఫ్ నుంచి రావడంతో వారం క్రితం వీరంతా ఆ ఊరు వెళ్లారు.

## ఖననానికి డబ్బులు లేక 5 గంటలు తండ్రి ఒడిలోనే

**టీ.మీడియా,నవంబర్19,మహబూబ్?నగర్:**



అందరం దేవుడు చేసిన బొమ్మలమే. కానీ కొందరికీ ఐశ్వర్యం, సరైన ఆరోగ్యంతో పాటు అన్నీ ఇస్తాడు. మరికొందరికీ అవన్నీ ఇవ్వడు. కొందరు మనుషులను దేవుడు సక్రమంగా పుట్టిస్తాడు. మరికొంత మందిని ఏదో ఒక వైకల్యంతో పుట్టిస్తాడు. వైకల్యంతో పుట్టించిన వారిని కూడా ఇంకా దీనస్థితిలో ఉన్న ఇంట్లోనే పుట్టేలా చేస్తాడు. అలాంటి వారి పరిస్థితిని చూస్తే కళ్లంట నీళ్లు రావాల్సిందే. ఇంకొందరిదైతే ఇంకా దీన పరిస్థితి. చనిపోయినాసరే కాటికి చేర్చడానికి నా అనేవారు ఉండరు. ఖననం చేయడానికి చేతిలో డబ్బులు కూడా ఉండవు. అలాంటి వారి దీనస్థితిని మాటల్లో అసలు వర్ణించలేం. నలుగురు లేకపోతే ఆ బతుకు ఎందుకు రా అంటారు పెద్దలు.సరైన తిండి లేక అనారోగ్యానికి గురై దివ్యాంగుడైన కుమారుడు మృతి చెందాడు. అతన్ని ఖననం చేయడానికి తండ్రి చేతిలో చిల్లిగవ్వ కూడా లేదు. మృతదేహాన్ని భుజాన వేసుకొని శ్మశానానికి వెళ్లాడు. అక్కడ సాయానికి ఎదురుచూస్తూ మృతదేహాన్ని ఒడిలో పెట్టుకొని ఐదు గంటలపాటు ఎదురు చూసిన హృదయ విదారక ఘటన మహబూబ్?నగర్? జిల్లా ప్రేమ్?నగర్?లో జరిగింది. తల్లి కూడా ఆ చిన్నారి వైకల్యాన్ని చూసి గతంలోనే తండ్రి వద్దే వదిలేసి వెళ్లిపోయింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం, ప్రేమ్?నగర్?కు చెందిన బాలరాజ్? స్థానిక పత్తి మిల్లులో పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటూ ఉండేవాడు. ఏడాది కిందట మిల్లు మూతపడటంతో ఉపాధి కోల్పోయారు. ఆర్థిక ఇబ్బందులు చుట్టుముట్టడంతో అతడికి భార్యతో తరచూ గొడవలు అవుతూ ఉండేవి. వారికి ఇద్దరు కుమారులు ఉన్నారు. వారిలో పెద్ద కుమారుడైన హరీశ్?(8) అవయవ లోపం, మానసిక వైకల్యంతో జన్మించాడు. భర్తకు సంపాదన లేకపోవడంతో భార్య చిన్న కుమారుడిని తీసుకొని ఆర్నెళ్ల కిందట ఇంటి నుంచి వెళ్లిపోయింది.

**ఏడుస్తూ సాయం కోసం ఎదురుచూపు**

బాలరాజ్? దివ్యాంగుడైన పెద్ద కుమారుడిని అల్లారు ముద్దుగా చూసుకునేవాడు. ఆ చిన్నారి ఆలనాపాలనా చూసుకుంటూ ఓ హోటల్?లో పని చేస్తున్నాడు. హరీశ్? సోమవారం తీవ్ర అనారోగ్యానికి గురై మృతి చెందాడు. మృతదేహాన్ని తీసుకొని ప్రేమ్?నగర్? శ్మశానవాటికకు వెళ్లారు. అంత్యక్రియల పూర్తికి చిల్లిగవ్వ లేకపోవడంతో మధ్యాహ్నం 2 గంటల నుంచి కుమారుడి మృతదేహాన్ని ఒడిలో పెట్టుకొని ఏడుస్తూ సాయం కోసం ఎదురు చూశారు.స్థానికులు జడ్చర్లకు చెందిన వీఆర్? స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులకు సమాచారం ఇవ్వడంతో సంస్థ ప్రతినిధి ప్రవీణ్? వాలంటీర్లతో సాయంత్రం 7 గంటలకు అక్కడకు చేరుకున్నారు. పొక్లెయిన్?తో గుంత తీయించి ఖననం చేశారు. 4 రోజులుగా ఆహారం లేక ఇద్దరం నీరు తాగే ఉన్నామన్నాడు. తానూ అనారోగ్యానికి గురయ్యానని బాలరాజ్? తెలిపారు. వీరి స్థితిని చూసిన అక్కడ వారు కన్నీటి పర్యంతమయ్యారు. ఇలాంటి వారికి దేవుడే దిక్కు అని, అయ్యో పాపం అని నలుగురు నాలుగు రకాలుగా అనుకుంటున్నారు. బాలరాజ్?ను ప్రభుత్వమే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# యశ్వంత్ రెడ్డియే సొసైటీ చైర్మన్



**టీ మీడియా, నవంబర్ 19, టేక్మాల్:** మెదక్ జిల్లా టేక్మాల్ మండలంలో సొసైటీ చైర్మన్ గా హైకోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో యశ్వంత్ రెడ్డినే ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (పీఏసీఎస్) చైర్మన్ గా కొనసాగిస్తూ డీసీవో ఉత్తర్వులను జారీ చేశారు. ఈ మేరకు బుధవారం ఆయనకు డీసీవో కరుణాకర్ ఉత్తర్వులను అందజేశారు. టేక్మాల్ సొసైటీ చైర్మన్ గా కొనసాగుతన్న ఆయనపై కాంగ్రెస్ పార్టీ బలపర్చిన డైరక్టర్లు కొందరు అవినీతి ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో డీసీవో ఆయన్ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులను జారీ చేశారు. అవినీతి ఆరోపణలు నిరూపింతం కాకుండానే తనను ఏ విధంగా సస్పెండ్ చేస్తారని హైకోర్టును ఆశ్రయించారు. విచారణ పూర్తి కాకుండానే కొందరి డైరక్టర్ల ఫిర్యాదు, అధికార పార్టీ ప్రోద్భలంతో తనను సస్పెండ్ చేయడం సరికాదని కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో సొసైటీ కమీషనర్ సమర్పించిన నివేదిక ఆధారంగా యశ్వంత్ రెడ్డిపై ఎలాంటి అవినీతి ఆరోపణలు రుజువుకాలేదని, అందుకు తాము సస్పెండ్ ను ఎత్తివేస్తూ 2014 ఆగస్టు 14 తేదీకి ముందు ఉన్న పాలక వర్గాన్ని కొనసాగించనున్నట్లు పేర్కొవడంతో పాత పాలక వర్గాన్ని యాథాతదంగా కొనసాగిస్తున్నట్లు నవంబర్ 19, 2025న డీసీవో ఉత్తర్వులను జారీ చేశారు. దీంతో పాత పాలక వర్గమే కొనసాగుతున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడైంది. పర్సన్ ఇంచార్జీ చైర్మన్ యశ్వంత్ రెడ్డి, పర్సన్ ఇంచార్జీ సభ్యులుగా వెంకయ్య, ఆకులపల్లి పాపయ్య, సాదు కిషన్, చందర్, బాగారెడ్డిగారి నర్సింహారెడ్డి, మంగమ్మ, పులి సత్యనారాయణ, ముదియాడ శ్రీశైలం, నాయికోటి శ్రీరాములు, సర్వని లక్ష్మిలు కొనసాగుతున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. దీంతో నేటి నుంచి టేక్మాల్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాత పాలక వర్గమే కొనసాగనుంది.

## ఎన్కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలి



**టీ మీడియా, నవంబర్ 19 ,పెద్దపల్లి:** అల్లూరి సీతారామరాజు జిల్లా మారేడుమిల్లి అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ ముమ్మాటికి బూటకపు ఎన్కౌంటరని, ఇట్టి ఎన్ కౌంటర్ పై న్యాయ విచారణ జరిపించాలని భారత కమ్యూనిస్ట్ పార్టీ సిపిఐ. సిపిఐయంఎల్ న్యూ డెమోక్రసీ రైతుకూలీ సంఘం ఆర్ సిఎస్ విప్లవ రచయితల సంఘం తెలంగాణ ప్రజా ఫ్రంట్ టీపీఫ్. ఏఐఎఫ్టియు డిమాండ్ చేసింది. ఈసందర్బంగా నిర్వహించిన పత్రికా సమావేశం లో సిపిఐ , న్యూ డెమోక్రసీ, రైతు కూలి సంఘం నాయకులు మాట్లాడుతూ సామ్రాజ్యవాదులకోసం భారత సైన్యం దేశ పౌరులనే వేటాడటం అమానుషమని, మోడీ అమిత్ షా ఓట్ చోర్ లేకాదు రక్తపిపాసులు అనేది నగ్నసత్యమన్నారుమారేడు మిల్లి అడవులోబూటకపు ఎన్కౌంటర్ లో అమరులైన కామ్రేడ్స్ మాడవి హిడ్మా, హేమ మరో నలుగురి మృతి పై సుప్రీం కోర్ట్ సిట్టింగ్ జడ్జి చే న్యాయ విచారణ జరిపించాలని ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేయాలని మధ్యభారతంలోని పోలీస్ క్యాంపులను ఎత్తివేయాలని ఆదివాసీ ప్రాంతాల్లో మోహరించిన సాయుధ పోలీస్ బలగాలను వెనక్కి రప్పించాలని పోలీసుల అధీనంలో ఉన్న ఇతర మావోయిస్టు నాయకులకు ఎలాంటి ప్రాణహాని తలపెట్టకుండా వెంటనే కోర్టు లో హాజరుపరచాలని డిమాండ్ చేసారు .ఈ కార్యక్రమంలో సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం. రైతు కూలి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, వెల్తురు సదానందం ,ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు కట్టా విశ్వనాథం ,డిహెచ్పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తాళ్లపల్లి లక్ష్మణ్ విరసం ,ఉమ్మడి కరీంనగర్ జిల్లా కన్వీనర్ బాలసాని రాజయ్య ,ఏఐ ఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు, రత్న కుమార్ ,తెలంగాణ ప్రజా ఫ్రంట్ టీపీఫ్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షులు గుమ్మడి కొమురయ్య ,ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు స్థాలిన్ ప్రజా సంఘాల నాయకులు లక్ష్మణ్, దీరజ్,తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు



**టీ మీడియా , నవంబర్ 19, పెద్దపల్లి:** పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు అంతటి అన్నయ్య గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా వారోత్సవాలు నిర్వహించారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా బుధవారం ఆరవ రోజు విద్యార్థిని విద్యార్థులకు, గ్రంథాలయ పాఠకులకు రంగోలి మెహందీ పోటీలు జడ్పీహెచ్ఎస్ బాయ్స్ పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈఓ టి .సురేందర్ కుమార్,పెద్దపల్లి ముఖ్య అతిథిగా విచ్చేసి పోటీలను ప్రారంభించారు .ఇట్టి పోటీలకు వివిధ పాఠశాలల నుండి దాదాపు 150 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా టీచర్లు ఆర్. వాణి శ్రీ మరియు పి.శ్రీలీల వ్యవహరించారు. ఈకార్యక్రమంలో టీచర్లు ఎం.డి హుస్సేన్ , ఏ.అంజయ్య గ్రంథాలయ జూనియర్ అసిస్టెంట్ గఫార్ గారు మరియు గ్రంథాలయ సిబ్బంది వై. మౌళి, యూనుస్ ఖాద్రీ స్వరూప, భారతి, దీప వివిధ పాఠశాలల నుండి వచ్చిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.




## రెండ్రోజులు బీ కేర్‌ఫుల్..

### జిల్లాలలో తీవ్రమైన చలి గాలులు

**టి మీడియా, నవంబర్ 19 , హైదరాబాద్ బ్యూరో :** రాష్ట్రంలోని కొన్ని జిల్లాలలో వచ్చే రెండు రోజులు తీవ్రమైన చలి గాలులు వీస్తాయని వాతావరణశాఖ మంగళవారం ఒక ప్రకటనలో హెచ్చరించింది. సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నిర్మల్, ఆదిలాబాద్‌లో ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు పేర్కొన్నది. ఆదిలాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, ఆసిఫాబాద్, కుమ్రంభీం, నిర్మల్ జిల్లాలతోపాటు మరో ఐదు జిల్లాలలో తీవ్రమైన చలిగాలులు వీచే అవకాశం ఉన్నదని తెలిపింది. కనిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 4 నుంచి 5 డిగ్రీల సెల్సియస్ వరకు తగ్గే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్–యూలో కనిష్ఠ ఉష్ణోగ్రతలు 6.8 డిగ్రీలు, సంగారెడ్డి జిల్లా కోహిర్‌లో 7.8 డిగ్రీలు, రాజన్నసిరిసిల్ల జిల్లా రుద్రంగిలో 8.0 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైనట్టు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా 14 డిగ్రీలలోపు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయని, చలిగాలుల తీవ్రత నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు హెచ్చరించారు.

### బంగాళాఖాతంలో వరుస అల్పపీడనాలు

బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ నెల 19నాటికి దక్షిణ అండమాన్ సముద్రం మీదుగా ఉపరితల ఆవర్తనం ఏర్పడే అవకాశం ఉన్నదని ప్రకటించింది. దీని ప్రభావంతో ఈ నెల 22న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని వెల్లడించింది. ఇది వాయుగుండంగా మారే అవకాశం ఉన్నదని పేర్కొన్నది. ఈ అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 24 నుంచి 27వరకు తెలంగాణ, కోస్తా, రాయలసీమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని తెలిపింది. చలికి వర్షాలు తోడైతే ప్రజల ఆరోగ్యం దెబ్బతినే అవకాశాలుంటాయని.. చిన్నారులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాలని తెలిపింది.

# కొడుకు కోసం తల్లి త్యాగం

## గిన్నిస్ రికార్డు కొల్లగొట్టిన కుమారుడు



**టి మీడియా, నవంబర్ 19 , బంగాల్ :** జీవితంలో అనుకున్న లక్ష్యాన్ని సాధించాలంటే ఎన్ని కష్టాలు ఎదురొచ్చినా తట్టుకుని నిలబడాలి. విజయం కోసం అహర్నిశలు శ్రమించాలి. లక్ష్యాన్ని చేరుకునే వరకు విశ్రమించకూడదు. అదే విషయాన్ని రుజువు చేశారు బంగాల్?కు చెందిన జ్యోతి మొండల్ అనే 30 ఏళ్ల యువకుడు. కథక్ నృత్యంలో రికార్డు సృష్టించి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్?లో చోటు దక్కించుకున్నాడు. ఈ క్రమంలో జ్యోతి మొండల్ విజయగాథపై ఈటీవీ భారత్ ప్రత్యేక కథనం.

### చిన్నప్పటి నుంచి కథక్ అంటే ఇష్టం

అలీపుర్దువార్?కు చెందిన జ్యోతి మొండల్?కు చిన్నప్పటి నుంచి కథక్ నృత్యం అంటే చాలా ఇష్టం. ఈ క్రమంలో కొడుకు ఇష్టాన్ని చూసి జ్యోతి మొండల్ తల్లి తన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టి అతడ్ని కథక్ డ్యాన్స్ క్లాసుల్లో చేర్పించింది. అదే విధంగా గుజరాత్, కోల్?కతాకు సైతం కథక్ నేర్చుకోవడం కోసం పంపింది. అంతలా ప్రతీ విషయంలోనూ కుమారుడిగా అండగా నిలిచి ప్రోత్సహించింది.

### ఇప్పుడు బాగా పాపులర్

కథక్ డ్యాన్సర్ అయిన జ్యోతి మొండల్?కు అలీపుర్దువార్?లో మంచి పేరుంది. ఆయన్ను అక్కడి ప్రజలు ముద్దుగా దేబజ్యోతి అని పిలుస్తారు. బిన్నగుడి ఆర్మీ స్కూల్ లో డ్యాన్స్ టీచర్?గా పనిచేస్తున్నాడు. బిర్పారాలో సొంత నృత్య అకాడమీని నడిపిస్తున్నాడు. అయితే అతడు సాధించిన విజయం నృత్య చరిత్రలో ప్రత్యేకమైనది. కథక్ నృత్యం చేస్తూ 30 సెకన్లలో 68 సార్లు తన చుట్టూ తాను తిరిగాడు. దీంతో గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్?లో తన పేరును లిఖించుకున్నాడు. దీంతో జ్యోతి కుటుంబం సంతోషం వ్యక్తం చేసింది.

### కష్టాలను ఎదురొడ్డి

అయితే జ్యోతి మొండల్ ఈ విజయం అంత సునాయాశంగా రాలేదు. తన జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాడు. తల్లి ప్రోత్సాహంతో కెరీర్?లో రాణించాడు. జ్యోతి తండ్రి చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. అప్పటి నుంచి అతడి తల్లే కుటుంబ బాధ్యతను మోసింది. చిన్న దుకాణం నడుపుతూ దాని ద్వారా వచ్చే ఆదాయంతో కుటుంబాన్ని పోషించింది. ఎన్ని కష్టాలున్నా జ్యోతి మొండల్?కు కథక్ పట్ల ఉన్న ఆసక్తిని చూసి ఎప్పుడూ వెనక్కి తగ్గలేదు. కొడుకుకు కథక్ నేర్పించడం కోసం తన బంగారు ఆభరణాలను సైతం తాకట్టు పెట్టింది.కథక్ నృత్యం చేస్తూ రొటేషన్?లో తిరగడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పడానికి జ్యోతి మొండల్ గతంలో చాలా సార్లు ప్రయత్నించాడు. కానీ సక్సెస్ కాలేకపోయాడు. అయినా పట్టు విడవలేదు. గతేడాది అక్టోబరులో తన ప్రదర్శన వీడియో, అందుకు సంబంధించిన పత్రాలను గిన్నిస్ వరల్డ్ అధికారులకు పంపాడు. ఆఖరికి ఈ ఏడాది దుర్గా పూజ సమయంలో చాలా కాలంగా ఎదురుచూస్తున్న గుర్తింపు వచ్చింది. దీంతో జ్యోతి కుటుంబం, అతడి స్నేహితుల సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవలే జ్యోతికి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్ కూడా అందింది.నేను 2012 నుంచి కథక్ నేర్చుకుంటున్నాను. కోల్?కతా, అహ్మదాబాద్ వెళ్లి గురువుల దగ్గర కథక్ ప్రాక్టీస్ చేశాను. 2019 నుంచి చాలాసార్లు ప్రయత్నించినప్పటికీ ప్రపంచ రికార్డ్ సాధించలేకపోయాను. చివరికి నా కల నిజమైంది. కథక్ చేస్తూ 30 సెకన్లలో 68 సార్లు రొటేషన్ లో తిరిగాను. నా గురువులు, తల్లిదండ్రుల ఆశీర్వాదం లేకుండా ఇది సాధ్యం కాదు" అని జ్యోతి తెలిపాడు.

### తల్లి హర్షం

మరోవైపు, తన కుమారుడు సాధించిన ఘనతపై జ్యోతి తల్లి వీణ సంతోషం వ్యక్తం చేసింది. తాను ఎన్ని కష్టాలు పడినా తన కుమారుడిని ఎప్పుడూ నిరుత్సాహపర్చలేదని తెలిపింది. జ్యోతి తన జీవితంలో ఏదైనా సాధిస్తాడని చిన్నప్పటి నుంచి అనుకుంటున్నానని చెప్పింది. కానీ ప్రపంచ రికార్డు సృష్టిస్తాడని ఎప్పుడూ అనుకోలేదని వెల్లడించింది. తన కుమారుడు పడ్డ కష్టానికి తగ్గ ఫలితం దక్కిందని పేర్కొంది.



# ఆర్టీసీ డిపో నిర్మాణానికి అడుగులు

**టీ మీడియా, నవంబర్ 19, పెద్దపల్లి:**తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో పెద్దపల్లి జిల్లా కేంద్రంలో బస్ డిపో నిర్మాణానికి బుధవారం రోజున ఆర్టీసీ అధికారులు, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యేభూమి పూజ చేశారు.అనంతరం బస్ డిపో ఏర్పాటు చేయనున్న పాత ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో తిరిగి, పాత భవనాలు, నరికి వేసిన చెట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే విజయరమణ రావు మాట్లాడుతూ..బస్సు డిపో ఏర్పాటు పెద్దపల్లి ప్రజల చిరకాల వాంఛ అని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పెద్దపల్లి జిల్లా కేంద్రంలో జరిగిన యువ వికాస పబ్లిక్ మీటింగ్ కు వచ్చిన సందర్భంగా పెద్దపల్లి బస్ డిపో ఏర్పాటుకు జీవో ఇచ్చారని అందుకు అనుగుణంగా 4 ఎకరాల 34 గుంటల భూమిని ఆర్టీసీకి ఇచ్చినట్టు తెలిపారు. సివిల్ సప్లై గోదాం, ఈఈ కార్యాలయం, మండల పరిషత్ తదితర కార్యాలయాలను షిఫ్ట్ చేసి, ఇటీవల చెట్లను తీసివేయడం జరిగిందని అన్నారు. ఆర్టీసీకి ఏ బిల్డింగ్ అవసరమో ఆర్ ఎం నేతృత్వంలో ప్లాన్ చేసి ముందుకు పోతున్నట్టు 6 నుండి 8 నెలల్లో డిపో పూర్తి చేసి, ఇక్కడి నుండే బస్సులు నడిచే విధంగా ప్లాన్ చేయడం జరిగిందని అన్నారు. బస్ డిపో మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి కి దీనికి సహకరించిన పొన్నం ప్రభాకర్ గౌడ్ కి, దుద్దిల్ల శ్రీధర్ బాబు కు కృతజ్ఞతలు తెలిపారు. అధికారులు బస్సు డిపో పనులకు సంబంధించి ఎలాంటి సహకారం కావాలన్నా ఎప్పుడు అవసరమొచ్చిన తనను సంప్రదించాలని ఆయన సూచించారు. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఒక్కదాని వెంట ఒకటి పూర్తి చేస్తున్నట్టు చెప్పారు.ఈ కార్యక్రమంలో పలువురు ఆర్టీసీ అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు , కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా మాజీ ప్రధాని జయంతి వేడుకలు



**టీ మీడియా ,నవంబర్ 19, ఆత్మకూరు :**భారతదేశ తొలి మహిళా ప్రధాని, పేదరిక నిర్మూలనకై కృషిచేసిన భారతరత్న శ్రీమతి ఇందిరాగాంధీ జయంతి సందర్భంగా ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆత్మకూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా మాట్లాడుతూ ప్రతి పేదవాడు అభివృద్ధి చెందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వం ద్వారా సాధ్యమవుతుందని, రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన ఎనుముల రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా పేదలకు ఉపయోగపడే ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, రైతులకు రుణమాఫీ,బోనస్ ప్రతి పేదవాడికి సంక్షేమ ఫలాలు అందాలని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్. పరమేష్ మండల అధ్యక్షులు, నల్గొండ శ్రీనివాసులు,పట్టణ అధ్యక్షులు, తులసిరాజు యాదవ్ మనివర్ధన్ రెడ్డి, పిన్నంచర్ల కాజన్నఅక్షర స్కూల్ నాగేష్ దామోదర్, మాజీ అధ్యక్షులు సైకిల్ నరసింహ, బుచ్చన్న సాయి రాఘవేంద్ర జహంగీర్ టైగర్ షాలు మనివర్ధన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# శ్రీసత్యసాయి శతజయంతి ఉత్సవాలు



యోజన అందించారన్నారు. బాలికల ప్రగతిలో సురక్ష సమృద్ధి యోజన కీలకమైందని వివరించారు. గరీబ్ కల్యాణ్ యోజన లబ్ధిదారుల సంఖ్య వంద కోట్లకు చేరిందని, ఓకల్ ఫర్ లోకల్ నినాదంతో ముందుకెళ్లాలని ప్రధాని మోదీ సూచించారు. స్థానిక ఉత్పత్తుల మార్కెటింగ్‌కు ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పుట్టపర్తి పవిత్రభూమిలో ఏదో మహత్తు ఉందని ప్రధాని మోదీ అన్నారు.

ప్రభుత్వాల కంటే వేగంగా సత్యసాయి స్పందించేవారు: ఈ భూమిపై మనకు తెలిసిన, మనం చూసిన దైవస్వరూపం సత్యసాయి అని చంద్రబాబు అన్నారు. సేవ, ప్రేమకు ప్రతిరూపం సత్యసాయిబాబా అని వివరించారు. విశ్వశాంతి, సర్వమానవ సంక్షేమం సత్యసాయి మార్గమని కీర్తించారు. మానవసేవే మాధవసేవ అని నమ్మి సత్యసాయి ఆచరించారని, ప్రపంచమంతా ప్రేమను పంచారని సీఎం అన్నారు. తాను విదేశాలకు వెళ్తే చాలామంది సత్యసాయి గురించి చెప్పేవారన్నారు.

ఆయన ఆశీస్సులతోనే తాగునీటి పథకం అందించామన్నారు. సత్యసాయి 102 విద్యాలయాలు, ఎన్నో వైద్యాలయాలు స్థాపించారన్నారు. ప్రభుత్వాల కంటే వేగంగా ఆయనే స్పందించేవారని, 1600 గ్రామాల్లో 30 లక్షల మందికి తాగునీరు అందించారని గుర్తు చేశారు. 140 దేశాల్లో 200 కేంద్రాల్లో సత్యసాయి ట్రస్ట్ సేవలందిస్తోందన్నారు. సత్యసాయి ట్రస్టుకు 7లక్షల మందికిపైగా వాలంటీర్లు ఉన్నారన్నారు. సత్యసాయి ప్రేమ సిద్ధాంతాన్ని మనమంతా అర్థం చేసుకోవాలని, సత్యసాయి చూపిన మార్గంలో మనం ముందుకెళ్లాలని వివరించారు. బాబా శతజయంత్యుత్సవాలకు కేంద్రం పూర్తిగా సహకరిస్తోందని అన్నారు. ఈ ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రకటించినట్లు చంద్రబాబు స్పష్టం చేశారు.

నేటి జల్‌జీవన్ మిషన్‌కు నాటి సత్యసాయి పథకమే అంకురం: విదేశాల్లో సత్యసాయి భక్తులను చాలా మందిని చూశానని ఆయన గొప్పతనం గురించి విదేశీయులు సైతం చెబుతారని పవన్ కల్యాణ్ అన్నారు. సత్యసాయి అత్యంత వెనకబడిన జిల్లాలో వెలిశారని తెలిపారు. సామాన్యుడికి తాగునీరు ఇవ్వాలని సత్యసాయి ఆలోచించారన్నారు. ఈ క్రమంలోనే తాగునీటి పథకానికి రూ.400 కోట్లు వెచ్చించారని స్పష్టం చేశారు. నేటి జల్‌జీవన్ మిషన్‌కు నాటి సత్యసాయి పథకమే అంకురమని పవన్ కల్యాణ్ కొనియాడారు. సత్యసాయి వేలమంది భక్తులను ప్రభావితం చేశారని, ఆయన ఇక్కడ పుట్టడం మన అదృష్టం అని పవన్ కల్యాణ్ అన్నారు.

### అది గోల్డెన్ మూమెంట్

ప్రజల్ని జడ్జ్ చేయొద్దని, వారిని అర్థం చేసుకోవాలని సత్యసాయి చెప్పారని క్రికెట్ దిగ్గజం సచిన్ తెందూల్కర్ అన్నారు. దీనివల్ల చాలా సమస్యలు తొలగిపోతాయని అన్నారు. 2011 వరల్డ్‌కప్‌లో తాను ఆడినప్పుడు భావోద్వేగాలు అధికంగా ఉండేవని, అప్పుడు బెంగళూరులో ఉన్నారని తెలిపారు. సత్య సాయిబాబా తనకు ఫోన్ కాల్ చేశారని, అనంతరం ఒక పుస్తకం పంపారన్నారు. అది తనలో సానుకూల దృక్పథాన్ని, స్ఫూర్తిని నింపిందని, ఆ సంవత్సరం టీం ట్రోఫీ కూడా గెలుచుకుందన్నారు. అది తనకు గోల్డెన్ మూమెంట్ అని సచిన్ తెలిపారు.

# 'పరకామణి కేసు'
# సాక్షులకు భద్రత కల్పించండి

### సీఐడీ డీజీకి హైకోర్టు ఆదేశం



**టి మీడియా, నవంబర్ 19 , తిరుమల :** తిరుమల శ్రీవారి పరకామణిలో చోరీ కేసు విషయంలో హైకోర్టు మంగళవారం కీలక ఉత్తర్వులిచ్చింది. చోరీ కేసులో ఫిర్యాదుదారుడు, పరకామణిలో సహాయ విజిలెన్స్ భద్రత అధికారి(ఏవీఎస్వో)గా పనిచేసిన సీఐ స్థాయి అధికారి వై.సతీష్‌కుమార్ తిరుపతిలో దర్యాప్తు అధికారి ముందు హాజరయ్యేందుకు వెళుతూ అసహజ రీతిలో మరణించడం న్యాయస్థానాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిందని వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో కేసులో నిందితుడు సీవీ రవికుమార్, సాక్షులకు దర్యాప్తు పూర్తయ్యేవరకు పోలీసు భద్రత కల్పించాలని సీఐడీ డీజీని ఆదేశించింది.

మరోవైపు సీఐడీ డీజీ పర్యవేక్షణలో దిగువస్థాయి అధికారులు కేసును దర్యాప్తు చేసేందుకు వెసులుబాటు ఇచ్చింది. నిందితుడు రవికుమార్, ఆయన కుటుంబసభ్యుల ఆస్తుల విషయంలో ఏసీబీ డీజీ ఆధ్వర్యంలో దిగువస్థాయి అధికారులు దర్యాప్తు చేసేందుకు అవకాశం కల్పించింది. దిగువస్థాయి సిబ్బంది దర్యాప్తు చేసేందుకు అనుమతి ఇవ్వాలంటూ సీఐడీ డీజీ దాఖలు చేసిన అనుబంధ పిటిషన్‌పై సానుకూలంగా స్పందించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గన్నమనేని రామకృష్ణప్రసాద్ మంగళవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులిచ్చారు. తదుపరి విచారణను డిసెంబరు 2కు వాయిదా వేశారు.పరకామణిలో చోరీ కేసును టీటీడీ బోర్డు, అధికారుల అనుమతి లేకుండా ఏవీఎస్వో సతీష్‌కుమార్ నిందితుడు రవికుమార్‌తో కలిసి లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవడం, దాని వెనుక జరిగిన పరిణామాలపై దర్యాప్తు చేయాలని సీఐడీ డీజీని ఆదేశిస్తూ గత నెల 27న హైకోర్టు ఉత్తర్వులిచ్చింది. మరోవైపు చోరీకి పాల్పడిన రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు కూడబెట్టిన స్థిర, చరాస్తులతో పాటు బ్యాంక్ ఖాతాలపై ఏసీబీ డీజీ ర్యాంక్ పోలీసు అధికారి దర్యాప్తు చేయాలని ఆదేశించింది. రిజిస్ట్రేషన్లు, ఇతర మార్గాల ద్వారా రవికుమార్, ఆయన కుటుంబసభ్యులు విక్రయించిన, ఇతరులకు కేటాయించిన ఆస్తులపై దర్యాప్తు చేయాలని స్పష్టంచేసింది. ఆ ఆస్తులను వారి ఆదాయానికి తగినట్లుగానే ఆర్జించారా? లేదా? అనే కోణంలో దర్యాప్తు చేయాలంది.మంగళవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా అదనపు పీపీ పాణిని సోమయాజి వాదనలు వినిపిస్తూ సీఐడీ డీజీ, ఏసీబీ డీజీ స్థాయి అధికారులు కేసు దర్యాప్తు చేయాలని గతంలో జారీచేసిన ఉత్తర్వులను సవరించాలని కోరుతూ అనుబంధ పిటిషన్ వేశామన్నారు. డీజీల పర్యవేక్షణలో దిగువస్థాయి అధికారులు దర్యాప్తు చేసేందుకు వెసులుబాటు కల్పించాలన్నారు. అందుకు న్యాయమూర్తి సానుకూలంగా స్పందిస్తూ ఉత్తర్వులిచ్చారు.

### పరకామణి కేసు ఫిర్యాదుదారు సతీష్??ది హత్యే! - ప్రాథమికంగా నిర్ధరించిన వైద్యులు

టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్‌కుమార్ మృతి దర్యాప్తులో పోలీసులు వేగం పెంచారు. తాడిపత్రి కోమలి రైల్వే ట్రాక్ వద్ద హత్యకు సంబంధించి సీన్ రీ కన్‌స్ట్రక్షన్?ను చేశారు. రన్నింగ్ ట్రైన్ నుంచి బొమ్మలను తోసి సీన్ రీ కన్‌స్ట్రక్షన్ చేశారు. దీనికి సంబంధించిన వివరాలను 2 డ్రోన్ కెమెరాలతో పోలీసులు చిత్రీకరించారు. టీటీడీ మాజీ ఏవీఎస్వో సతీశ్? మృతిని హత్యగా నిర్ధరిస్తూ ఇప్పటికే కేసు నమోదైంది. చివరకు ఇది హత్యేనని వైద్యులు వెల్లడించారు. టీటీడీ పరకామణి చోరీ కేసులో ఫిర్యాదుదారుగా సతీశ్?కుమార్ (మృతుడు) ఉండటం గమనార్హం.

# చైర్మన్ జావెద్‌కు 13రోజుల ఈడీ కస్టడీ

### విద్యార్థుల నుంచి రూ.415.10 కోట్లు వసూలు



**టి మీడియా, నవంబర్ 19 , ఢిల్లీ :** ఢిల్లీ పేలుడు ఘటనపై ముమ్మర దర్యాప్తు కొనసాగుతోంది. ఈ కేసుకు సంబంధించి అరెస్ట్ చేసిన హరియాణాలోని అల్-ఫలా యూనివర్శిటీ ఛైర్మన్? జవాద్ అహ్మద్ సిద్ధిఖీని దిల్లీ న్యాయస్థానం 13 రోజుల ఈడీ కస్టడీకి అప్పగించింది. ఇక యూనివర్సిటీపై ఈడీ నిర్వహించిన సోదాల్లో విద్యార్థుల నుంచి రూ.415.10 కోట్లు వసూలు చేసినట్లు తేలింది.ఢిల్లీ పేలుడు నిందితులకు ఉన్న సంబంధాల నేపథ్యంలో విశ్వవిద్యాలయం ఆర్థిక వ్యవహారాలపై మంగళవారం ఈడీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఉదయం 5.15 గంటలకు మొదలైన దాడులు, వర్సిటీకి చెందిన ప్రధాన కార్యాలయంతో పాటు సంస్థ ట్రస్టీలు, ప్రమోటర్ల ప్రాంగణాల్లో రోజంతా కొనసాగాయి. జవాద్ అహ్మద్ సిద్ధిఖీ ఇంట్లో కూడా అధికారులు సోదాలు నిర్వహించారు. ఆయన్ను ప్రశ్నించారు. అనంతరం నగదు అక్రమ చలామణి నిరోధక చట్టం కింద అరెస్టు చేశారు. అనంతరం దిల్లీలోని న్యాయస్థానంలో ప్రవేశపెట్టారు.యూనివర్శిటిలో తీవ్రమైన ఆర్థిక అక్రమాలు జరిగాయని కస్టడీకి ఇవ్వాలని న్యాయమూర్తిని కోరారు. తప్పుడు అక్రిడిటేషన్, తప్పుడు గుర్తింపులు చూపించి విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అల్-ఫలా విశ్వవిద్యాలయం, దాని పరిపాలన ట్రస్ట్ రూ.415.10 కోట్ల ఆర్జించినట్లు రిమాండ్ రిపోర్టులో ఈడీ ఆరోపించింది. రూ.48 లక్షలకు పైగా నగదు, డిజిటల్ పరికరాలు, డాక్యుమెంటరీ ఆధారాలు లభ్యమైనట్లు ఈడీ అధికారులు తెలిపింది. 2014-15 నుంచి 2024-25 ఆర్థిక సంవత్సరాల వరకు ఉన్న విశ్వవిద్యాలయ ఆదాయ పన్ను రిటర్నులలో ఫీజుల రూపంలో వచ్చిన ఆదాయాన్ని స్వచ్ఛంద విరాళంగా చూపిస్తున్నట్లు గుర్తించింది. అల్-ఫలా విశ్వవిద్యాలయంపై సిద్దిఖీ పూర్తి నియంత్రణను కలిగి ఉన్నారని వర్సిటీ ఆదాయంలో కొంత భాగాన్ని మాత్రమే తాము గుర్తించామని కోర్టుకు తెలిపింది. కస్టడీకి తీసుకుని విచారణ జరిపితేనే పూర్తి వివరాలు తెలుస్తాయని వివరించింది. ఈడీ అభ్యర్థనను అంగీకరించిన కోర్టు 13 రోజుల ఈడీ కస్టడీకి అనుమతి ఇచ్చింది.ఇటీవల ఫరీదాబాద్‌లో ఉగ్ర మాడ్యూల్‌ను అధికారులు ఛేదించారు. మాడ్యూల్‌లోని వ్యక్తులకు ఈ యూనివర్సిటీతో సంబంధాలు ఉన్నట్లు తేలింది. దీంతో యూనివర్శిటి పేరు ప్రముఖంగా వినిపిస్తుంది. మాడ్యూల్‌తో సంబంధాలు బయటపడిన తర్వాత ఇండియన్ యూనివర్సిటీల సంఘం (%ూ×ఖ%) అల్-ఫలా విశ్వవిద్యాలయం సభ్యత్వాన్ని రద్దు చేసింది. ఈక్రమంలో దిల్లీ పోలీసులు యూనివర్సిటీలపై రెండు వేర్వేరు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఫోర్జరీ, మోసం పేరిట కేసు నమోదయ్యాయి. మరోవైపు విశ్వవిద్యాలయానికి న్యాక్ షోకాజ్ నోటీసులు ఇచ్చింది. విద్యాసంస్థ వెబ్‌సైట్‌లో గుర్తింపు గురించి తప్పుడు సమాచారం ప్రచురించినందుకు గానూ ఇవి జారీ చేసినట్లు తెలిపింది. సోమవారం విశ్వవిద్యాలయం ఛైర్మన్ జావెద్‌కు రెండు సమన్లు జారీ చేశారు.

# ఇల్లు అద్దెకు ఇవ్వాలంటేనే

### -వణికిపోతున్న ఓనర్స్




**టి మీడియా, నవంబర్ 19 , విజయవాడ :**మావోయిస్టుల కదలికల నేపథ్యంలో సాధారణ ప్రజల్లో కూడా ఆందోళన పెరిగింది. పాత రోజులు మళ్లీ వచ్చాయేమో అనే భయం ఇప్పుడు జనాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. దీంతో నగరంలో ఎవరు కొత్తగా కనిపించినా ప్రజలు వారిని అనుమానిస్తున్నారు. దీంతో విజయవాడలో ఇల్లు అద్దెకు ఇచ్చేందుకు జనాలు భయపడిపోతున్నారు. ఇక్కడ ఇల్లు అద్దెకు ఇవ్వడం అనేది ఒకప్పుడు సామాన్య ప్రక్రియ.. ఒక ఫోన్ లేదా రెండు మాటలు చెప్తే చాలు ఇల్లు అద్దెకు ఇచ్చువారు.. కానీ ఇప్పుడు పరిస్థితి మాత్రం పూర్తిగా మారిపోయింది.అద్దెకు ఇల్లు ఇవ్వాలంటే ప్రజలు కఠిన నిబంధనలు పెడుతున్నారు. ఇల్లు అద్దెకు కావాలంటే ఆధార్ కార్డు, పాన్ కార్డు డీటెల్స్ తప్పనిసరి అంటున్నారు. కొంతమంది అయితే పాత రెంటల్ అడ్రస్ , ఆఫీస్ ఐడి, ఫోన్ నెంబర్, వెరిఫికేషన్ కూడా అడుగుతున్న పరిస్థితి కనపడుతుంది.. ప్రజలు ఇంతలా భయడడానికి ప్రధాన కారణం.. అనుమానాస్పద వ్యక్తులు విజయవాడ నగరంలోకి ప్రవేశించారని ప్రచారం జరగడం.దీంతో పాటు అద్దెకు ఇల్లు ఇచ్చేముందు వారి పూర్తి వివరాలు తీసుకోవాలని పోలీసులు ప్రజలకు విజ్ఞప్తి చేయడం కూడా ఇందుకు ఒక కారణం. అలాగే వారి వివరాలను సమీప పోలీస్ స్టేషన్‌కు కూడా తెలియచేయాలని పోలీసులు చెబుతున్నారు. ప్రతి ఇంటి యజమనాలు తమ ఇంట్లో ఉంటున్న వారి ఫ్యామిలీ వివరాలను కూడా తీసుకోవాలని సూచిస్తున్నారు.ఈ నేపథ్యంలో విజయవాడలో అద్దె ఇల్లు గదులు ,హాస్టల్లో కూడా వెరిఫికేషన్ ప్రక్రియ మరింత కఠినంగా మారింది. కొంచెం అనుమానం వచ్చినా ప్రజలు అద్దెకు ఇల్లు ఇవ్వడానికి ముందుకు రావడం లేదు.. ఒకవైపు నగర అభివృద్ధి మరోవైపు భద్రతా చర్యలు ఇలా రెండు ముఖ్యమని నగర ప్రజలు తెలియజేస్తున్నారు. కావునా అద్దెకు వచ్చే వాళ్లు కూడా తమకు సహకరించాలని చెబుతున్నారు.

# సత్య సాయి జయంతి వేడుకలు



**టీ మీడియా ,నవంబర్ 19, ఆత్మకూర్ :**భగవాన్ శ్రీ సత్యసాయి శతజయంతి ఉత్సవాలలో భాగంగా ఉదయం వనపర్తి జిల్లా ఆత్మకూరు మండలం కస్తూరిబా బాలికా విద్యాలయము బాలకిష్టపూర్ విద్యార్థినీలలో క్లాస్ లోమొదటి శ్రేణి, రెండవద శ్రేణి విద్యార్థినీలకు ప్రోత్సాహక బహుమతులు విద్యార్థినీలందరికి పెన్నులు, ప్రసాదం ఇచ్చారు. ఈనెల 23 నుండి వివిధ కార్యక్రమాల్లో భాగంగా ప్రతి ఉదయం నగర సంకీర్తన భజనలు మధ్యాహ్నం అన్నప్రసాదాలు సాయంత్రం బాలావికాసులో పట్టణంలోని విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు జరుగునని నిర్వాహకులు తెలిపారు



# రేషన్ డీలర్లకు దొడ్డు బియ్యం కష్టాలు..

### -పట్టించుకోని అధికార యంత్రాంగం

**టి మీడియా, నవంబర్ 19 ,వరంగల్ :**?జిల్లాలోని రేషన్ డీలర్లు దొడ్డు బియ్యం నిల్వలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో పంపిణీ చేసిన దాదాపు 847 మెట్రిక్ టన్నుల దొడ్డు బియ్యాన్ని ప్రభుత్వం వెనక్కి తీసుకోకపోవడంతో రేషన్ షాపుల్లో నిల్వ సామర్థ్యం సరిపోక సన్న బియ్యం పంపిణీ నిర్వహణ పెద్ద తలనొప్పిగా మారిందని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 509 రేషన్ షాపుల్లో ఒక్కో షాపులో సుమారు 5 నుంచి 40 క్వింటాళ్లకు పైగా దొడ్డు బియ్యం నిల్వలు పేరుకుపోయాయి.ఈ ఏడాది మార్చి నెల నుంచి బియ్యం వెనక్కు తీసుకోవాలని డీలర్లు పదేపదే జిల్లా ఉన్నతాధికారులను కలిసి వినతి పత్రాలు సమర్పించినప్పటికీ పట్టించుకోవడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. పేరుకుపోయిన నిల్వల కారణంగా డీలర్లు సన్న బియ్యం పంపిణీ కోసం దొడ్డు బియ్యం బస్తాలను పక్కనబెట్టి స్థలాన్ని సర్దుబాటు చేయాల్సి వస్తోంది. ?ఎక్కువ కాలం నిల్వ ఉండడం వల్ల దొడ్డు బియ్యం పాడైపోతున్నాయి.ఎలుకలు, పురుగుల వల్ల దొడ్డు బియ్యం పూర్తిగా మట్టిలో కలిసిపోతున్నాయని డీలర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.దొడ్డు బియ్యం కోసం వచ్చిన ఎలుకలు, పురుగులు ఇప్పుడు సన్న బియ్యాన్ని కూడా పాడు చేస్తున్నాయని డీలర్లు వాపోతున్నారు. కొంత మంది డీలర్లు పాడైన దొడ్డు బియ్యాన్ని శుభ్రం చేయించి మళ్లీ బస్తాల్లో నింపి భద్రత పరుస్తున్నారు. ప్రస్తుతం దొడ్డు బియ్యం నిల్వలు ఉండడం వల్ల సన్న బియ్యం పంపిణీ ప్రక్రియ గందరగోళంగా మారుతోందని డీలర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకొని, నిల్వ ఉన్న దొడ్డు బియ్యాన్ని వెనక్కి తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.